# న్యాయం

శ్రీ కె. సన్యాసయ్య

పదినెలల్నుంచీ పని చేస్తున్నాడన్నమాటే గాని, చెప్పొద్దూ, వెంకన్నెప్పుడూ ఇలాటి పని చెయ్యలేదు. ఇలాటిపని చేస్తాడని నాకు ఇంతవిసరేనా అనుమానంఉంటే ఇంతకాలం ఉండనిచ్చేవాణ్నా మాయింట్లో? పిలిచీపిలవడం తోటే పలుకుతూ, చెప్పినవన్నీ ఎంతో నమ్మకంగా చేస్తూఉండగానే నౌకర్లబాధ వదిలిందని నే సంతోషిస్తూఉంటే, ఈపనిచేసి నాకూ వాడికీ అందరికీకూడా ఇబ్బంది తెచ్చిపెట్టేడు.

ఈఊళ్ళో ప్రాక్టీసుపెట్టి అప్పుడే పదిసంవత్సరాలు పైగా అవొస్తోంది; పదిహేనుమందికి పైగా అయేరు నౌకర్లు. దీనిక్కారణం వెదికితే మా ఇంట్లోనే ఉంటుందేమోనని సందేహపడ్డా కొన్నాళ్ళు. కాని ఇంట్లోపని రాళ్లూ రప్పలూ మొయ్యడంకంటే కనాకష్టం కాదుగాదా అనండి. పైగా రోజుకూలీ అయితే ఒకరోజుదొరుకుతుంది; ఒకరోజు దొరకదు. ఏదేనా మిగిల్నా తగిల్నా వాడికే ఇస్తున్నాంకదా.—ఏదేనా అనుకుని పోతాడేమోనని, మొదటి తారీఖు రాగానే ఏఖర్చు ఎలావున్నా వాడిజీతం ఎనిమిదిరూపాయలూ లెక్కపెట్టి వాడిమొహాన్న పారేస్తున్నానయిరి. ఇంతకంటే ఏంకావాలి వాళ్ళకి?

ఇంతకీ వెధవగుణం ఎక్కడికి పోతుంది? మంచిగుణాలూ, మంచిబుద్ధీ కూలిపని చేసుగునే వాళ్ళకి ఎక్కణ్నుంచి వస్తుంది? దినదినగండం అయితేగాని వాళ్ళకి తృప్తిలేదు. దొంగతనం చేస్తే అది బైటికి వచ్చింతరవాత వాళ్ళమెడకి చుట్టుగుంటుందని తెలియొద్దూ? అందులో ప్లీడరుగారింట్లో జరిగింది బంకనక్కెరు కాయలాగా ఒకపట్టాన్ని ఒదుల్తుందా!

అయినాగానీ, ఒకళ్ళనని యేంలాభం? మా గాడిదకి బుద్ధిలేకపోయింతరవాత? లక్షమాట్లు చెప్పేను—'నీవస్తువుల విషయంలో జాగ్రత్తగా ఉండరా' అని. పైగా అంటాడూ—టేబిల్ డ్రాయర్లో పెట్టేట్ట; తాళాన్ని టేబిల్‌మీద పారేస్తే, తాళం వేసినందువల్ల లాభంఏమిటి? తాళంతీసి పట్టుకుపోయేడంటే వాడిదా తప్పు?

ఈ కుర్రకుంకలికి వస్తువుల విలువే తెలియదు. ఈకాలంలో రిస్టువాచీ అంటే మాటల్తోఉందా? ఈపాడు యుద్ధం రాకముందయితే అరవైయయిదూ, డెభ్భైరూపాయలు పెడితే వచ్చేది. ఇప్పుడు విపరీతంగా ఖరీదయిపోయింది. నూటపభై, నూటపభైయయిదు పెట్టినా ఎవ్వడూ అమ్మడానికి సిద్ధంగాలేడు సరిగదా, అసలు వాచీ లెక్కడివీ అమ్మడానికీ అమ్మకపోడానికీను?

నేనైతే అసలు కొనేవాణ్ణేకాదు అంతడబ్బా [illegible]

చెల్లారాంని పుల్లారెడ్డి మాటమీద మాటొచ్చి చెయ్యి చేసుగున్నాడు.

చెల్లారాం కాస్తా నాదగ్గరికొచ్చి పుల్లారెడ్డిమీద పరువునష్టందావా వేద్దామన్నాడు. కేసు నాదగ్గరికొచ్చిందని తెలియగానే పుల్లారెడ్డి 'వీడు అసాధ్యుడురా' అని చెల్లారాంకి క్షమాపణ రాసిచ్చేడు. ఈ ఉపకారం చేసినందుకని చెల్లారాం నాకీ వాచీ బహుమతిగా ఇచ్చేడు. "ఎందుకయ్యా నాకీ వాచీ, ఏదో రొక్కంలోనే పారెయ్యకూడదా" అంటే, "అలాక్కాదండి పంతులుగారూ నాపేరుమీద తమదగ్గిర ఈవస్తువుండాలి" అంటూ ఇచ్చాడు.

పోనీ కుర్రాడు సరదాగా పెట్టుగుంటాడుగదా అని వాడికిస్తే, ఫలితం ఇదీ!

యిక మా అవిడ తెలివితేటలు మావాడి తెలివితేటల్ని మించిపోయాయి. తలంటిపోసుగుందాంగదా అని అద్దంవెనకాల పెట్టిందట ఉంగరాన్ని! ఎవళ్ళకీ కనిపించదుగదా అని దాని ఉద్దేశ్యంట! నేను చెబుతూనే ఉన్నాను—ఎవళ్ళకి ఎలాటిబుద్ధి ఎప్పుడు పుడుతుందో చెప్పలేమని. పోయాయంటే పోవూ?

అవాచీ, ఈ ఉంగరం రెండూ పట్టుకు పోయాడు. మళ్ళీ అవి దొరికినప్పుడుమాట. ఈకాలంలో పోలీసువాళ్ళు సరిగ్గా పనిచేసిపెడతారూ! చూద్దాం!

## 2

ఇంకా నయం, కొంపమునిగిపోను! చెల్లారాం నాకు తెలిసినవాడు గనక సరిపోయింది లేకపోతే ఎంత అమర్యాదా!

మంచిగుణాలూ, మంచిబుద్ధీ సహజంగా రావాలిగాని చెబితేవస్తాయా? ఏం, అలాటి పని చెయ్యకపోతే నన్నడిగితే, ఓ అయిదో పదో ఇయ్యకపొయ్యేనా? వాచీ వెంకన్న దొంగిలించేడుగదా. ఇంక మళ్ళీ యింట్లో ఏంపోయినా అన్నిటికీ వాడే జవాబుదారీ అవుతాడుగదా అని మావాడు చేసినపనిచూస్తే, నాకే సిగ్గవుతోంది. ఆ ఉంగరం కాస్తా తీసిగెళ్ళి చెల్లారాంకొట్లో అమ్మ జూపేట్ట, అసలు ఖరీదుకి సగం చొప్పున కొనేస్తేరుట వాళ్ళూను. పోనీ ఎందుకేనామంచిది, పంతులుగారికి చూపించి ఇలాటియిలాటి సంగతని చెబితే బాగుంటుందిగదా అని చెప్పేసి ఉంగరం తీసుగొచ్చి కథంతాచెప్పేరు, వాళ్ళడబ్బు వాళ్ళ[illegible] ఉంగరం నిర్ధరించుకోవలసివచ్చింది.

యింటికొచ్చింతరవాత వాడి పస పట్టాలి. ఇలాటి పనులుచేస్తే బాగానే ముందుకొస్తాడు.

ఇంతకీ మావాడి బుద్ధి కుక్కతోకలాటిది. తిన్నగా చెయ్యాలంటే నావశమా?

అయినాగానీ ఎంతపని జరిగింది! ముందుగా తెలియకపోతే ఎంతపని జరిగిపోను!

## 3

పోలీసులు వట్టి శుంఠలు, ఒక్కొక్కప్పుడు ఖల్లాకప్పట్టుపట్టినా, ఒక్కొక్కప్పుడు తేలిగ్గా లొంగిపోతారు. నా ప్లీడరీ మైకం వేస్తేనేగాని లొంగేరుకారుమరి. వాళ్ళక్కావల్సిందంతా కేసులు పెట్టడం, ప్రమోషన్‌పొందటం, అంతేగాని ఇంకేమీ అక్కర్లేదు.

హెడ్‌కాన్‌స్టబుల్‌వచ్చి, వాచీ అచోకిదొరికింది గాని ఉంగరం పతా తెలియలేదంటాడు. వాళ్ళకెలా తెలుస్తుంది. నన్నడిగితే తెలుస్తుందిగాని!!

ఉంగరం దొరికిందనీ బహుశా వెంకన్న వాచీ తీస్తూంటే కింద జారిపడిపోయి ఉండవచ్చునీ నచ్చచెప్పేశాను.

నావాచీ నాకొచ్చింది. ఏదో అయిదారు రూపాయలు ఖర్చయితే అయిందిగాని డబ్బుమాటా వాచీమాటా అలాగుంచి మర్యాదా దక్కింది.

"నాడబ్బు నాకెలాగా వచ్చింది, పాపం వాణ్ణెందుకర్రా యింకా బాధపెడతారు?" అని నేనడిగితే,—"అలాక్కాదండీ పంతులుగారూ, ఈనెలల్లా డైరీ ఖాళీగా ఉండిపోయిందండీ, ఒక్కకేసైనా పెడితేగాని మాటదక్కదండీ, క్షమించండి" అంటూ కేస్ దాఖల్‌చేశాడు.

## 4

తగినశాస్తి అయింది వెంకన్నకి.

ఆర్నెల్లు కఠినశిక్ష.

తన పెళ్ళాం ప్రాణంమీదికి వచ్చిందిట. గవర్నమెంటు హాస్పిటల్‌కి తీసిగెళితే, కాంపౌండరు, "దొరగారికి తీరికలేదు. నేనువస్తాను. మందుకి నాల్గురూపాయలు జాగ్రత్త పెట్టు" మన్నాట్ట. నన్నడిగితే ఇప్పుడు లేదన్నానట్ట అడగ్గానే ఇవ్వడానికి వాడి తాతగారిడబ్బు దాచబెట్టినట్లు మాట్లాడేడు. నాలుగురూపాయలూ పెళ్ళాం మందుకే ఖర్చుపెడితే, ఏంతింటాడు నెలపాటూను?

ఏమయితేనేం, మనమర్యాదా దక్కింది. చల్లారాం దయవల్ల. లేకపోతే ఎంతపని జరిగిపోను!